

Visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

శనివారం, 21 సెప్టెంబర్ 2024

పేజీలు: 04


## రైస్ మిల్లులో తనిఖీలు చేసిన రాష్ట్ర విజిలెన్స్ అధికారులు

బిక్కనూర్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్



మండల కేంద్ర శివారులో ఉన్న విజయ గణపతి రైస్ మిల్ లో శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్ లో ధాన్యానికి సంబంధించిన బిల్లులను తనిఖీ చేసి, ధాన్యపు బస్తాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓ ఎస్ డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర విజిలెన్స్ అధికారులు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తాహసిల్దార్ కిష్టయ్య అధికారులు ఉన్నారు.

## గిరిజన ఉద్యోగికి సన్మానం

భీమ్‌గల్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్



భీమ్‌గల్ సబ్ పోస్ట్ ఆఫీస్ లో ప్రధాన అధికారిగా మూడు ఏండ్ల నుండి పనిచేసి బదిలీపై వెళుతున్న ఉద్యోగి బనావత్ మధన్ లాల్ ను సన్మానించారు. శుక్రవారం స్థానిక బంజారా భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. భవిష్యత్తు లో ఉన్నత స్థానంలో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో బంజారా సంఘం నాయకులు శర్మనాయక్, తుక్కాజీ, బోర్ లింగం, రాజు నాయక్, మంగ్యా నాయక్, రాములు, లక్ష్మణ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒకరి ఆత్మహత్య

రెంజల్, సూర్య మేజర్ న్యూస్, సెప్టెంబర్ 20

మండలంలోని సాటపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం మేరకు సాతాపూర్ గ్రామానికి చెందిన దెబ్బడ నవీన్ అనే వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్ఐ తెలిపారు. నవీన్ కు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో పాటు, జీవితంపై విరక్తి చెంది తనకు తానుగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య దెబ్బడ స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## కట్టుకున్న భర్తను కడతేర్చేందుకు భార్య యత్నం.

- భర్త పై గొడ్డలితో భార్య దాడి.
- దొంగతనం జరిగిందంటూ కట్టు కథ అల్లిన వైనం.
- కేసును చేదించిన పోలీసులు.
- నిందితురాలు అరెస్ట్, రిమాండ్.

నాగిరెడ్డిపేట్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్

తాళి కట్టిన భర్తను కడ తేర్చేందుకు ప్రయత్నించి, గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారని కట్టు కథ అల్లి, కేసును తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేసిన నిందితురాలిని పోలీసులు పట్టుకొని కేసును ఛేదించారు. శుక్రవారం ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్, స్థానిక ఎస్సై మల్లారెడ్డి తో కలిసి నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. ఎల్లారెడ్డి సీఐ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బంజారా తండా గ్రామానికి చెందిన ధారావత్ నిర్మల, ధారావత్ మోహన్ లిద్దరు దంపతులు. ధారావత్ మోహన్ మానసికంగా అనారోగ్యంతో ఉండేవాడని, భర్త అనారోగ్యం కోసం ఆసుపత్రులకు, మందులకు వేలాది రూపాయలు ఖర్చు అయ్యేవని, దీంతో తన భర్తను ఎలాగైనా హతమార్చాలని గట్టిగా నిర్ణయించుకొని ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి దాటాక తన భర్త గాఢ నిద్రలో ఉండడంతో భర్త మోహన్ మెడపై గొడ్డలితో నిర్మల దాడిచేసిందన్నారు. అతను అపస్మారక స్థితికి చేరుకోవడంతో చనిపోయాడని భావించిన నిర్మల తమ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చొరబడి తన భర్త మోహన్ ను కత్తితో దాడి చేశారని, ఇంట్లో ఉన్న బంగారు నగలు దోచుకెళ్ళారని గ్రామస్తులకు చెప్పింది. దీంతో గాయలపాలైనా మోహన్ వెంటనే చికిత్స నిమితం హైదరాబాద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. బుధవారం ఉదయం ధరావత్ నిర్మల తమ ఇంట్లో గుర్తులేని దుండగులు చొరబడి తన భర్త మోహన్ పై దాడి చేసి ఇంట్లో ఉన్న బంగారాన్ని దోచుకెళ్ళారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాసులు, సిఐ రవీందర్ నాయక్, స్థానిక ఎస్సై మల్లారెడ్డి, లు కలిసి డాగ్ స్క్వాడ్ ను రప్పించి, వేలిముద్రలు సేకరించి విచారణ చేపట్టారు. తమ విచారణ కొనసాగుతున్న క్రమంలో మోహన్ భార్య నిర్మల పారిపోయిందని



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి సిఐ



కానిస్టేబుల్ కు రివార్డ్ అందజేస్తున్న సీఐ.

2

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం : జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి బ్యూరో, సూర్య మేజర్ న్యూస్, సెప్టెంబర్ 20

కామారెడ్డి జిల్లాలో 351 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై శుక్రవారం కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐకెపి ఆధ్వర్యంలో 23, సహకార సంఘాల ఆధ్వర్యంలో 328 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వానకాలం అక్టోబర్ రెండో వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు. ముందస్తుగా అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని పేర్కొన్నారు. జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్ కు రూ.2203/-, సాధారణ కామన్ గ్రేడ్ కు క్వింటాల్ కు ధర రూ.2183/- చెల్లించనున్నట్లు తెలిపారు. గన్ని సంచులు, ప్యాడి క్లీనర్స్, టార్పాలినులు సిద్ధం చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి, టెంటు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డి ఆర్డి ఓ సురేందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, సివిల్ సప్లై మేనేజర్ రాజేందర్, సహాయ సివిల్ సప్లై అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డి సి ఓ రామ్మోహన్, ఎల్డిఎం రవికాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, అధికారులు పాల్గొన్నారు.



## కట్టుకున్న భర్తను కడతేర్చేందుకు భార్య యత్నం.

( మొదటి పేజీ తరువాయి )

సీఐ తెలిపారు. శుక్రవారం ఉదయం నాగిరెడ్డిపేట బస్టాండు వద్ద అనుమాన స్పదంగా తిరుగుతున్న నిర్మలను అదుపులోకి తీసుకొని విచారణ జరిపినట్టు సీఐ తెలిపారు. తమ విచారణలో నిర్మల తను చేసున నేరాన్ని ఓప్పు కున్నట్టు సిఐ తెలిపారు. మోహన్ తరుచు ఆరోగ్యానికి గురవుతుండటంతో పాటు, అతని వైద్య నిమిత్తం వేలాది రూపాయలు ఖర్చవుతున్నందున ఎలాగైనా తన భర్తను కడతేర్చాలని నిర్మల భావించిందని సిఐ తెలిపారు. ఈ క్రమంలోనే తన భర్త మోహన్ పై గొడ్డలితో దాడి చేసి అతన్ని గాయపర్చిందన్నారు. తీవ్రంగా గాయపడిన అతను అపస్మారక స్థితికి చేరుకోవడంతో,తమ ఇంట్లో దొంగలు చొరబడినట్టు, తమ భర్తపై దొంగలు కత్తితో దాడి చేసినట్టు, బంగారు నగలు ఎత్తుకుపోయినట్టు ఓ కట్టు కథ అల్లిందని, కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని సీఐ వివరించారు. నిర్మల తను చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో నిర్మలపై హత్యాయత్నం కేసు ను నమోదు చేసి, ఆమెను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు సీఐ తెలిపారు.ఈ కేసును చేదించేందుకు విశేష కృషి చేసిన కానిస్టేబుల్ బానోత్ గంగారాం, ను జిల్లా ఎస్పీ సింధు శర్మ, ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు, సిఐ రవీందర్ నాయక్ లు అతన్ని అభినందించారు, అతనికి రివార్డ్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

- 40 కోట్ల సభ్యత్వ నమోదు లక్ష్యం.
- జిల్లా బిజెపి మహిళా అధ్యక్షురాలు అరుణ తార





**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్** : భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు జిల్లా బిజెపి మహిళా అధ్యక్షురాలు అరుణ తార ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం స్థానిక గాంధీ చౌక్ లో స్వచ్ భారత్ కార్యక్రమన్ని నిర్వహించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు సభ్యత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా బిజెపి మహిళా అధ్యక్షురాలు అరుణతార మాట్లాడుతూ., బీజేపీ సభ్యత్వం, గిన్నిస్ బుక్ రికార్డ్ స్థాయి లో బిజెపి నిర్వహిస్తుందని అన్నారు. ఆమె మాట్లాడుతూ సాధ్యం అనే దృఢ సంకల్పం తో సుమారు 40 కోట్ల సభ్యత్వం నమోదు లక్ష్యంగా ప్రారంభించడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా జనరల్ సెక్రటరీ రవీందర్ రావ్, అసెంబ్లీ కన్వీనర్ లింగరావు, రాష్ట్ర నాయకులు బత్తిని దేవేందర్, మర్రి బాలకిషన్ , ఎల్లారెడ్డి బిజెపి మండల అధ్యక్షులు పెద్దేడ్ల నర్సింలు, పట్టణ అధ్యక్షులు, సతీష్, జనరల్ సెక్రటరీ పీకే నరేష్, ఎస్ ఎన్ రెడ్డి, ప్యాలాల రాములు, శంకర్, సత్యం,పండరి, సాయిలు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విజయ డైరీ పాడి రైతుల బిల్లులు చెల్లించండి

**సదాశివనగర్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్**

కామారెడ్డి జిల్లాలోని నరసన్నపల్లి డైరీ పరిధిలో 7000 మంది పాడి రైతులు విజయ డైరీకి పాలు సరఫరా చేస్తున్నారని, నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని బారాస నాయకులు ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఒక కోటి 50 లక్షల రూపాయల బిల్లులు రైతులకు చెల్లించవలసి ఉన్నప్పటికీ ప్రభుత్వం కుట్రపూరితంగా బిల్లుల చెల్లింపు ఆలస్యం చేసి ప్రైవేట్ డైరీలకు కొమ్ము కాస్తుందన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా రైతులు ఆర్థికంగా ఎదుగుదల కోసం బర్రెలు, ఆవులను పెంప కం చేస్తూ కుటుంబ ఖర్చులను సంపాదించుకుంటు న్నారని, అలాంటి పరిస్థితుల్లో నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు వస్తే బర్రెలకు, ఆవులకు దాణా ఇతర సంబంధించిన వస్తువులు తెచ్చుకొని మరిన్ని పాలు ఇచ్చే విధంగా ప్రయత్నించే రైతులకు డబ్బులు రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో విజయ డైరీలో 15 రోజులకు ఒకసారి బిల్ వచ్చేదని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు నెలలు గడిచిన బిల్లులు చెల్లించడం లేదన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం నిర్వహించే విజయ డైరీ కాపాడుకోవడానికి అయినా



ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని వెంటనే రైతుల బిల్లులు విడుదల చేయాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి సదాశివనగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు, రామారెడ్డి మండల మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, కాలభైరవ స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ సతీష్ గుప్తా, జిల్లా బీసీ నాయకుడు కలాలి సాయాగౌడ్, మద్దికుంట మాజీ ఎంపీటీసీ రాజేందర్, మండల్ యూత్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకుడు పోతుల లింగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్, మండల నాయకులు మల్లేష్, లింబాద్రి నాయక్, రెడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల ఎల్ఓసి అందజేసిన షబ్బీర్ అలీ.



**కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, సెప్టెంబర్ 20**

కామారెడ్డి పట్టణానికి చేందిన పి. రవి కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ అపరేషన్ చేయవల సిందని చెప్పగానే వాళ్ల కుటుంబం ఆర్థిక ఇబ్బందు లు ఉన్నందున కాంగ్రెస్ నాయకులను సంప్రదించ గా వెంటనే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి విషయం చెప్పడంతో వెంటనే అయన స్పందించి నిమ్స్ హాస్పిటల్ డాక్టర్ తో మాట్లాడి రవికి ప్రభుత్వం తరపు నుండి చికిత్స నిమిత్తం 2,00,000/- రూపాయల ఎల్.ఓ.సి ఇవ్వడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి రవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం

**బిక్కనూర్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్**

రైతు సమస్యల కోసం తమ వంతుగా కృషి చేస్తామని, మండలంలోని తిప్పాపూర్ భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు తాటిపల్లి సిద్ధి రాములు చెప్పారు. శుక్రవారం గ్రామంలో సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సంఘ ఉపాధ్యక్షుడిగా గంపల కమలాకర్, కార్యదర్శి కొండ సాయిలు, కోశాధికారి కస్తూరి మహేష్, ముఖ్య సలహాదారు బస్వారెడ్డి, కార్య వర్గ సభ్యులుగా తిరుపతి, భూపాల్ రెడ్డి,బాలా గౌడ్, మల్లు పేట భూమయ్య, కోటి గళ్ళ రవి, ఇల్లిందల స్వామి, కృష్ణజేడ మల్లయ్య, ధర్మారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి సంగిరెడ్డి రాజేశం, కామారెడ్డి మండల అధ్యక్షుడు కొరిమిశెట్టి అంజయ్య, మండల సలహాదారుడు భైరవరెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొండా సిద్ధిరాములు, గ్రామ మాజీ సర్పంచ్ నాచారపు స్వామి, మాజీ ఎంపీటీసీ దాయారి సాయి రెడ్డి, ధర్మగల రాజయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## పోచారం లో పంట పొలాల క్షేత్ర పరిశీలన.

**ఎడపల్లి, సెప్టెంబర్ 20,సూర్య మేజర్ న్యూస్** : ఎడపల్లి మండలము లోని పోచారం గ్రామంలో శుక్రవారం పంట పొలాల క్షేత్ర పరిశీలన చేయడమైనది. పొలాలలో ఆకు ఎండు తెగులులో అనేది, %శ్రీ% ప్రతి గ్రామంలో చెరువు కింద ఉన్న భూముల్లో వచ్చిందని, దీని నివారణకు బాక్టోమైసిన్ లేక అగ్రి మైసిన్ అనే మందులు పిచికారి చేయాలి. వారానికి రెండు సార్లు పిచికారి చేయాలి. వేరే మందులతో కలపకూడదు. మరియు సుడిదోమ కూడా గుర్తించడం జరిగినది. చెస్ లేక ఫేక్సలోన్ మందులను కింద మొదలు తడిచేటట్టు పిచికారి చేయాలి. యూరియా ఎరువులు తగ్గించుకోవాలి.అట్లాగే నీటినిలోని నీటిని తీసేసిన తర్వాతనే మందులు పిచికారి చేయాలిని మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో నిరడి రవికుమార్, పోచారం గ్రామస్తులు, తదితరులు పాల్గోన్నారు.



## రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏడీఈ.

**రాజంపేట, సూర్య మేజర్ న్యూస్, సెప్టెంబర్ 20**

వ్యవసాయ బావుల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడీఈ కిరణ్ చైతన్య చెప్పారు. రాజంపేటలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ పట్ల రైతులందరూ ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డబ్బాల వద్ద విద్యుత్ వైర్లు మరమ్మతులు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రైతులు ఉన్నారు.



## వ్యవసాయ మార్కెట్ గోదాములను పరిశీలించిన ఏఎంసీ చైర్మన్.

ఎడపల్లి, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్



ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామం లో గల ఎడపల్లి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని గోదాములను బుధవారం ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యా దామోదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., రానున్న మరికొద్ది రోజుల్లో వరి, కోతలు ప్రారంభమవుతాయని, దానికి అనుగుణంగా గోదాముల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా ఆదాయం పెరిగేలా చూడాలని, దీంతోపాటు సిబ్బంది పనితీరు పట్ల ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామనాథరావు, వైస్ చైర్మన చీల శంకర్, డైరెక్టర్లు బొబ్బిలి శ్రీనివాస్, కిషోర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎంపీ ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సదాశివనగర్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్



జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ ని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మెమెంటో ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొంబోతుల లింగాగౌడ్, జిల్లా గౌడ సంగం జనరల్ సెక్రటరీ బాలార్జున్ గౌడ్, సదాశివనగర్ మండల ప్రధానకార్యదర్శి లక్ష్మిపతి పాల్గొన్నారు.

## పీఎం శ్రీ ద్వారా పాఠశాలలకు మహర్ధశ...

భీమ్గల్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలలకు మహర్ధశ పడుతుందని మండల విద్యా శాఖ అధికారి స్వామి అన్నారు. శుక్రవారం భీమ్గల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకం ద్వారా నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ నిర్మాణం కొరకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని పక్కా అమలు చేసేందుకు పీఎం శ్రీ పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా 9 వేయిలు, తెలంగాణ లో 543 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. సైన్స్ ల్యాబ్ నిర్మాణం కొరకు కేంద్ర ప్రభుత్వం రూ 13 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, పనులు పూర్తి చేయించడం ద్వారా ల్యాబ్ ను స్టూడెంట్స్ కు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని ఎంఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు లైట్ల వితరణ

బిక్కనూర్, సెప్టెంబర్ 20, సూర్య మెజార్ న్యూస్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఫౌండేషన్ సభ్యులు విద్యార్థుల సౌకర్యార్థం లైట్లను వితరణగా ఇచ్చారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరావుకు శుక్రవారం లైట్లను అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో లైట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరావు చెప్పడంతో వెంటనే స్పందించి లైట్లను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని, పాఠశాలకు విలువైన లైట్లు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు.

- ఉమ్మడి జిల్లా యాంటీ డ్రగ్స్ ఇంచార్జీ సోమనాథం.
- డి యస్ పి శ్రీనివాస్ లు.





ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం లో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉమ్మడి జిల్లా యాంటీ డ్రగ్స్ ఇంచార్జీ సోమనాథం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ అవగాహన సదస్సులో డిఎస్పి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ., గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పట్ల నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో వుందని, ఈ ప్రమాదం భారీన పడకుండా యువత అప్రమత్తంగా వుండాలని, కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాలను సేవించడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను సాధించడం ఓ కలగానే మిగిలిపోతుందని, కొంత మంది వ్యక్తులు తమ డబ్బు సంపాదన కోసం గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడి యువతకు అందించడం జరుగుతోందని వారు తెలిపారు. ఇలాంటి స్వార్థపరుల చేతుల్లో యువత బలికావద్దని, ఎన్నో ఆశలతో మిమ్మల్ని ఉన్నత చదువులు చదివించి మీ బంగారు భవిష్యత్తుకై ఎదురుచూసే తల్లిదండ్రులకు తమ పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారడంతో తల్లిదండ్రులు ఎలాంటి వేదనకు గురౌవుతున్నారు. ప్రతి ఒక్కరు మీ తల్లిదండ్రుల గురించి ఒక్కసారి ఆలోచించండి. మత్తు పదార్థాల వినియోగం ద్వారా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, ఎన్నో ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతాయని యువత గ్రహించాలని, అలాగే మీ తోటి మిత్రులు మత్తు పదార్థాలను సేవిస్తున్నట్లయితే మత్తు పదార్థాల వినియోగం ద్వారా నష్టాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా గంజాయి లాంటి మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తోందని, ఇందులో భాగంగా ఈ యాంటీ డ్రగ్స్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం, సబ్ ఇన్స్పెక్టర్ బొజ్జ మహేష్ మాట్లాడుతూ., ఎల్లారెడ్డి పరిధిలో గంజాయి నియంత్రణకై డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఉమ్మడి జిల్లా నిజమాబాద్ లో ఏర్పాటు చేయడం జరిగిందనీ డ్రగ్స్ నియంత్రణకై ఎల్లారెడ్డి ఏరియా లో ఒక ఎస్సై వున్నారని, ఎక్కడ్కైనా మత్తు పదార్థాలు సేవిస్తున్న, రవాణా, విక్రయాలు పాల్పడుతున్న వారిపై పట్టుకోవడే ఈ విభాగం ప్రత్యేకతని అని అన్నారు. ఎవరైన మత్తు పదార్థాలు అమ్మిన, సేవించిన సమాచారం అందించడం ద్వారా వారిపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని, పెద్ద ఎత్తున గంజాయి సమాచారం తెలిపిన వారికి నగదు పురస్కారం కూడా అందజేయబడుతుందని అన్నారు. అలాగే సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా వుంచబడుతాయని తెలిపారు. అనంతరం పోలీసు అధికారులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బృందం ప్రత్యేకంగా శాలువాలతో సన్మానించినారు. ఈ అవగాహన సదస్సులో ఉమ్మడి జిల్లా యాంటీ డ్రగ్స్ ఎల్లారెడ్డి ఏరియా ఎస్సై, షీ టీం సభ్యులు, ప్రభుత్వ డిగ్రి కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ శంకర్ అధ్యాపకులు, సిద్ది రాజు తదితర అధ్యాపకులు, విద్యార్థిని, విధ్యార్థులు పాల్గోన్నారు.



## నూతన బోరు మోటర్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్.

కామారెడ్డి, సూర్య మెజర్ న్యూస్, సెప్టెంబర్ 20



కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో గల 46వ వార్డులో నూతన బోరు మోటార్ ను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 46వ వార్డు కౌన్సిలర్ కోయల్కర్ కన్నయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన బోర్ వేసి మోటార్ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా 46వ వార్డు ప్రజలు మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా నీళ్లతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని, ట్యాంకర్లతో నీళ్ళు తెప్పించుకుందామన్నా కూడా ట్యాంకర్లు రాలేని పరిస్థితి ఉందని, ఇట్టి విషయన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ కన్నయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకువెళ్లి బోర్ వేయించి మోటర్ పెట్టి ప్రారంభించినందుకు వార్డు కౌన్సిలర్ కన్నయ్యకు, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్స్ పంపరీ శ్రీనివాస్. చింతల శ్రీనివాస్,రవి, హుస్సేన్, వాటర్ మెన్ రాజు, అజీమ్, శశికళ, మీనా, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## కేసీఆర్ అనాలోచితానికి బలి.. నెల జీతం తీసుకోకుండానే రిటైర్మెంట్..

# ఆవేదన వ్యక్తం చేస్తున్న 55 టు 61 వీఆర్ఏలు.

**నిజామాబాద్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్.** పల్లెటూరు, గ్రామాలు, పట్టణాల్లో పట్టు కొమ్మలుగా నిలిచిన వీఆర్ఏలు అయోమయ పరిస్థితిని ఎదుర్కొం టున్నారు. ఎక్కడికి వెళితే న్యాయం జరుగుతుందోనని బరువెక్కిన గుండె కలిగి గంపెడాశతో ఎదురుచూపులు చూస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదుకొని న్యాయం చేయాలని ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. గత మాజీ సీఎం కెసిఆర్ ప్రభుత్వం అనాలోచిత 81 జీవో వల్ల పూర్వ వీఆర్ఏల బతుకులు చిన్నా భిన్నమవు తున్నాయి. దిక్కుతోచని స్థితిలో ఆయా కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. కెసిఆర్ ప్రభుత్వం తీసు కొచ్చిన 81 జీవో ప్రకారం 55 టు 61 సంవత్సరాల లోపు వీఆర్ఏలు అన్యాయానికి బలవుతున్నారని చెప్పొచ్చు. బిఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసే క్రమంలో వీఆర్ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు కోసం తెచ్చిన జీవో 81, 85, 98 వలన ఒక్క నెల జీతం తీసుకోకుండానే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 150 మంది, నిజామాబాద్ జిల్లాలో 65 మంది రాష్ట్రంలో దాదాపు 600 మంది పూర్వ వీఆర్ఏలు పదవి విరమణ పొందారు. ఎలాంటి జీతం తీసుకోకుండానే ఆర్థిక ప్రయోజనం లేకుండా రిటైర్మెంట్ కావడంతో వారి బాధలు వర్ణనాతీతం. అంతేకాకుండా జీవో 81 ప్రకారం వీఆర్ఏలను రెండు వర్గాలుగా సృష్టించిన ప్రభుత్వం 61 సంవత్సరాల వయస్సు లోపు ఉన్నవారు, 61 సంవత్సరాల వయస్సు పైబడిన వారుగా ఏర్పడ్డారు. ఇలాంటి నిర్ణయం వల్ల 55 సంవత్సరాల వయస్సు పైబడి 61 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వీఆర్ఏల వారసులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక నెల ఒక సంవత్సరం రెండు సంవత్సరాలలో పదవి విరమణ అయ్యే వారిని ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి రోడ్డున పడేయడం న్యాయం కాదని పేర్కొంటున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో 2500 మంది ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ తీసుకోకుండా ఐదు సంవత్సరాల సర్వీస్ కూడా చేయకుండా అతి తక్కువ సమయంలో రిటైర్ కావడం వారి మనస్థాపానికి గురిచేస్తుంది. కానీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వీఆర్ఏ వారసులను ఆదుకుంటుందని నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్ లతో పాటు ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు బిజెపి సిపిఎం పార్టీల ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి రెవెన్యూ కొత్త చట్టం రూపొందిస్తున్న సమయంలో జీవో 81ను సవరించి వీఆర్ఏ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

### ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా రిటైర్ కావడం బాధాకరం



**నీరడి భూమయ్య, రేకుల పల్లి**

అర్హత కలిగిన వీఆర్ఏలకు పదోన్నతులు 55 సంవత్సరాల వయసు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు అంటూ మూడు నెలలు సమ్మె చేసినా ఫలితం లేకుండా పోయింది. 61 సంవత్సరాల వయస్సు పైబడి ఉన్న వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇస్తామని గత ప్రభుత్వం మాట ఇచ్చి అన్యాయం చేసింది.

### అన్యాయానికి గురవుతున్న దళిత కుటుంబాలు.



**రొడ్డ పోశెట్టి, కొల్బూర్ గ్రామం నందిపేట్ మండలం**

55 నుండి 61 సంవత్సరాల వయస్సు కలిగిన వీఆర్ఏలు అధిక సంఖ్యలో దళితులు ఉండడం గమనార్హం. ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా పదవి విరమణ పొందడం వల్ల తినడానికి తిండి లేని పరిస్థితులను దళిత కుటుంబాలు ఎదుర్కొంటున్నాయి.

### మెడికల్ ఇన్వాలిడేషన్ కు అవకాశం లేదు..



**గుర్రపు రాజన్న, చీమన్ పల్లి**

అటు ఐదు సంవత్సరాల పూర్తి సర్వీస్ లేకపోవడం, ఇటు మెడికల్ ఇన్వాల్యుడేషన్ పెట్టుకునే అవకాశం లేకుండా రిటైర్మెంట్ కావడం మనోవేదన గురిచేస్తుంది. మా స్థానంలో మా వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సరియైన న్యాయం జరిగినట్లే. కాంగ్రెస్ ప్రభుత్వం దయ, కనికరం చూపించాలి.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

**ఎడపల్లి, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్** ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ సిపిఐ ఎంఎల్ ప్రజాపందా బోధన్ డివిజన్ నాయకులు గుమ్ముల గంగాధర్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ., ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ రెండు లక్షలు రైతులకు అందరికీ కాలేదు.రాని వారికి రైతులకు మాఫి వర్తింపజేయాలని, రైతు భరోసా ఎకరానికి 15 వేల రూపాయలు వెంటనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, కొత్త వారికి వృద్ధాప్య కొరకు దరఖాస్తు చేసుకోవటం జరిగింది. కొత్త వారికి 4016 రూపాయలు పింఛన్ని ఇవ్వాలి. కొత్త రేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలి. కాలి స్థలం ఇల్లు కట్టుకోవడానికి ఉన్నవారికి ఐదు లక్షల నుంచి పదిలక్షల వరకు పెంచివ్వాలి. రైతు పండించిన సన్న రకం వడ్లకు ఒక క్వింటాలుకు 500 రూపాయలు



బోనస్ వెంటనే విడుదల చేయాలిని, తదితర డిమాండ్లతో కూడిన అంశాలు గురించి ఎడపల్లి డిప్యూటీ తాసిల్దార్ అనూష కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్వతి రాజేశ్వర్, షేక్ నజీర్, కాశ రవి, శ్రీపతి మల్లేష్, కొండ్ర లక్ష్మణ్, రెంజల్ చిన్న పోశెట్టి, ఎర్రన్న,ఆలూరి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## మర్కల్ లో స్వచ్ఛ హి సేవ కార్యక్రమం

**సదాశివనగర్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్**





సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలో మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినిలు శుక్రవారం స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత కార్యక్రమంపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రజలుండే ప్రాంతంలో బస్టాప్, టీ షాపుల పరిసరాల నుంచి ప్లాస్టిక్ వస్తువులను విద్యార్థినులు తొలగించారు. 8 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. శ్రావణి, కార్యదర్శి స్రవంతి, అధ్యాపకురాలు ఉదయిని, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పోషక ఆహార పదార్థాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి : సిడిపిఓ జానకి

**రెంజల్, సూర్య మేజర్ న్యూస్, సెప్టెంబర్ 20** గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు పోషక ఆహార పదార్థాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సిడిపిఓ జానకి అన్నారు. శుక్రవారం రెంజల్ మండల కేంద్రం లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోషణ అభియాన్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., గర్భిణీ, బాలింతలు ఆకుకూరలను, పప్పు దినుసులను తీసుకుంటే వారి శారీరక దృఢత్వానికి దోహదపడతా యన్నారు. న్యూట్రిషన్ సంబంధించిన పదార్థాలను ప్రతిరోజు ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక ఆహార పదార్థాల యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని ఇంటి



వద్ద కూడా కుటుంబీకులకు ఆహారంలో భాగంగా అందించాలన్నారు. చిన్నారులకు అన్నప్రాసన కార్య క్రమాన్ని గర్భిణీలకు శ్రీమంతాలు, పుట్టినరోజు వేడుకలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, సూపరింటెంట్ శ్రీనివాస్, ఎంఈఓ గణేష్ రావు, ఆరోగ్య విస్తీర్ణధికారి రవీందర్, ఆయా గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు, గర్భిణీ, బాలిం తలు, చిన్నారులు తదితరులు ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తోటి రోగాలు దూరం:ఆరోగ్య సిబ్బంది

**బిక్కనూర్, సెప్టెంబర్ 20, సూర్య మేజర్ న్యూస్ :** తమ ఇంటి పరిసర ప్రాంతాల పరిశుభ్రత తోటి రోగాలు దరి చేరవని ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ చెప్పారు. శుక్రవారం ఫ్రైడే- డ్రై డే సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆశా కార్యకర్తలు నిర్వహించిన ఇంటింటి ద్వారా సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఆరోగ్య సిబ్బంది- ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్నారని, ఆస్పత్రిలో వారికి మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నివారణకు ప్రజలందరూ ఆశా కార్యకర్తలకు సహకరించాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.